రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 9,140 మంది విద్యార్థులు
- ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి బైరి శ్రీనివాస్

మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు జిల్లా అధికారి శ్రీనివాస్

జనగామ రూరల్, ఫిబ్రవరి 26: ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి బైరి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఐఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మొదటి, రెండో సంవత్సరం కలిపి మొత్తం 9,140 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన వెల్లడించారు. మొదటి సంవత్సరం నుంచి జనరల్ విద్యార్థులు మొత్తం 3,166, వొకేషనల్‌లో 1,197మంది పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 3,578, వొకేషనల్‌లో 1,198 మంది పరీక్షలు రాయనున్నట్లు బైరి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఫ్లయింట్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. జనగామలో 10, స్టేషన్ ఘన్‌పూర్‌లో మూడు, జఫర్‌గఢ్, నర్మెట, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పలలో ఒక్కో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, పెన్, పెన్సిల్, రబ్బర్ ఎగ్జామ్ ప్యాడ్, మ్యాథమాటికల్ పరికరాలను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. నోట్‌బుక్స్, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయన్నారు. విద్యార్థులు టీఎస్ బీఐఈ. సీజీజీ. జీవోబీ. ఇన్ వెబ్‌సైట్‌లో నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం పరీక్షల కోసం విద్యార్థులు పడే మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు (14416) టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ద్వారా నిపుణులు సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు. ఇంటర్ విద్య అధికారులు శేఖర్, ఆంజనేయ రాజు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్

దేవరుప్పుల : ఇంటర్ మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతున్నందున స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రాపోలు ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల విద్యార్థులతో పాటు మండల కేంద్రంలోని కేజీబీ, ఎస్వీ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ప్రథమ సంవత్సరంలో 173 మంది, ద్వితీయ సంవత్సరంలో 196 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఒక్కో పరీక్షకు మూడు ప్రశ్నపత్రాల సెట్లు రాగా పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్టు ప్రభాకర్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని, విద్యార్థులు 8.30 గంటల వరకు పరీక్షా కేంద్రానికి రావాలని ఆయన కోరారు.

లయన్స్‌క్లబ్ సేవలను విస్తరించాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 26 : సామాజిక సేవలో ముందున్న లయన్స్‌క్లబ్ మరింత విస్తృతంగా సేవలందించేందుకు నూతన సభ్యులను ఆహ్వానించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ గ్లోబల్ యాక్షన్‌టీం ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్య పిలుపునిచ్చారు. మండలంలోని నెల్లుట్ల భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన రీజియన్ మీట్‌లో వారు ముఖ్యఅతిథులు పాల్గొని మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా 1.5 మిలియన్ సభ్యులతో లయన్స్‌క్లబ్ ముందుకు సాగుతున్నదన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లు క్షేత్ర స్థాయిలో తమ సభ్యుల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని 15 లయన్స్ క్లబ్‌లు విశేషంగా సేవలందిస్తున్నాయని కొనియాడారు. అనంతరం చేర్యాల, జనగామ మిలీనియమ్ క్లబ్‌లకు బెస్ట్‌బ్యానర్ ప్రెజెంటేషన్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో కదిరి రాజశేఖర్‌రెడ్డి, సునీత, యాదిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ లవకుమార్‌రెడ్డి, డాక్టర్ బావనరెడ్డి, ప్రసాదరావు, వెంకటరెడ్డి, నరేందర్, పరశురాములు పాల్గొన్నారు.

నేడు టెన్త్ విద్యార్థులకు 'ప్రేరణ'

హాజరుకానున్న ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 : పదో తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్స్‌లో మంగళవారం ఉదయం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి మూర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవగాహన సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. భోజన వసతి కూడా కల్పించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా సౌజన్యంతో అందరికీ పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, హెచ్‌టీ కవర్లు, పరీక్ష కిట్లు అందిస్తారని మూర్తి వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల పదో తరగతి విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకురావాలన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న జయమణి

ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ

తరిగొప్పుల, ఫిబ్రవరి 26: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆర్‌జేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కేఎం జయమణి జాన్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ఆర్‌జేఎస్ ఫౌండేషన్ నేతృత్వంలో మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్నామని ఆమె తెలిపారు. వీటిని సద్వినియోగ చేసుకోని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ పీటర్, ఖాతా దేవదాసు, దామెర జీవరత్నం పాల్గొన్నారు.

రూ.24.50 లక్షలతో హైమాస్ట్ లైట్లు

లింగాలఘనపురం మండలంలోని ఏడు గ్రామాల్లో ఏర్పాట్లు

లింగాలఘనపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా హైమాస్ట్ లైటు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 26 : వరంగల్ లోక్ సభ సభ్యుడు పసునూరి దయాకర్ మంజూరు చేసిన రూ.24.50 లక్షలతో మండలంలోని ఏడు గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి వీటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్థానిక జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ దృష్టికి తీసుకురావడంతో నిధులు మంజూరు చేయించారు. దీంతో మాణిక్యపురంలో రూ.3.50 లక్షలతో రెండు హైమాస్ట్ లైట్లు, జీడికల్‌లో రూ.3.50 లక్షలతో రెండు, పటేలుగూడెంలో రూ.3.50 లక్షలతో రెండు, వనపర్తిలో రూ.3.50 లక్షలతో రెండు, మందోనిగూడెంలో రూ. 3.50 లక్షలతో రెండు, లింగాలఘనపురంలో రూ.3.50 లక్షలతో రెండు, నెల్లుట్లలో రూ. 3.50 లక్షలతో రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పనులు సైతం పూర్తవుతుండడంతో హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు కృషి చేసిన జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, నిధులు మంజూరు చేసిన ఎంపీ పసునూరి దయాకర్‌కు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 26 : మండలంలోని ఓబులాపురం, ముగ్ధం బండతండా, తిమ్మంపేట గ్రామాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పీటీసీ ఇల్లందుల బేబికి కేటాయించిన రూ.3.60 లక్షలతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ పాలనలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కన్నెబోయిన కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ గబ్బెట దేవదాసు, గబ్బెట శివయ్య, దొంతమాల సంతోష్, గిరిగాని రాజు, అజూరు వెంకన్న, అంగడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

హుండీ ఆదాయం రూ.7 లక్షలు

చిల్పూరు, ఫిబ్రవరి 26 : మండలంలోని లింగంపల్లిలో జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల ఆదాయాన్ని సోమవారం మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవాసమితి సభ్యులతో లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.7 లక్షల 500 సమకూరాయని ఆలయ ఈవో చిందం వంశీ తెలిపారు. ఎస్సై వినయ్‌కుమార్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, జాతర కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు సంపత్ రెడ్డి, రవీందర్, రాజు, బాలరాజు, రాజన్న, సత్తయ్య, రవీందర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

చాగల్లులో రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 : మండలంలోని చాగల్లు, రాఘవాపూర్ గ్రామాల్లో రైల్వే అండర్ బ్రిడ్జి (అండర్ పాస్) పనులకు జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మితో పాటు రైల్వే అధికారులు సోమవారం శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో రూ.41 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులతో పాటు 554 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, అండర్ పాస్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా చాగల్లులో ఎల్‌సీ 48, రాఘవాపూర్‌లోని ఎల్‌సీ 47 గేట్ల వద్ద రూ.8 కోట్ల చొప్పున అండర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. రాష్ట్రంలో 15 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ కొనసాగించనున్నారని రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ ఇంజినీరింగ్ మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డివిజన్ ఇంజినీరింగ్ నార్త్ రామకృష్ణ రాజు, కమర్షియల్ సూపరింటెండెంట్ సిన్హా , సీఐ ముక్క రాజు, కాజీపేట ఏఎస్సై రాంబాబు, ఎంపీటీసీ కనకం స్వరూపాగణేశ్, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సత్యారావు, గట్టు కుమారస్వామి, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ గణేశ్‌కుమార్, గట్టు కుమారస్వామి, సెంట్రల్ మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ తిరుపతిరావు, బొల్లపల్లి శ్రీనివాస్, బత్తుల కిరణ్‌కుమార్, స్వర్ణలత, శ్రీశైలం, వల్లాల వెంకటేశ్, బరిగె సంపత్, తోటకూర అనిల్, కాసాని మల్లయ్య, ఆకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాజీకి నాయకుల నివాళి

కొడకండ్ల, ఫిబ్రవరి 26 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ తండ్రి సిందె సత్తాజీ సంవత్సరీకం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సత్తాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఈజీసీ సభ్యుడు అందె యాకయ్య, మార్కెట్ చైర్మన్ పేరం రాము, బీఆర్ఎస్ నాయకులు దీకొండ వెంకటేశ్వర్‌రావు, మేటి సోమరాములు, పుస్కూరి సంపత్‌రావు, కే భిక్షపతి, చెంచు రాజిరెడ్డి, సోమిరెడ్డి, సుధీర్ రెడ్డి, దేశగాని సతీశ్, వీ రామ్‌కోటి, వెంకన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 26: అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండలాధ్యక్షుడు గిరగాని కుమార్‌స్వామిగౌడ్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు గాదెపాక భాస్కర్, యూత్ అధ్యక్షుడు మాదాసి హరీశ్‌గౌడ్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి , రమణారెడ్డి, కాంగ్రెస్ మండల కార్యదర్శి భార్గవ్, పన్నీరు వెంకన్న, కమ్మగాని నాగన్న, వీరమనేని శ్రీనివాస్ రావు, బోలగాని స్వర్ణ, ఎండీ సలీమ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

చిల్పూరు, ఫిబ్రవరి 26 : మండలంలోని దేశాయి తండ, చిల్పూరు గ్రామాల్లో చెరువుల్లో మట్టి పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఏపీడీ చంద్రశేఖర్ మాట్లాడారు. సోమవారం ఉపాధి హామీ పనులపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం నర్సరీలను పరిశీలించిన ఆయన మొక్కల వివరాలు తెలుసుకున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నర్సరీ ద్వారా ప్రజలకు మొక్కలను సరఫరా చేయాలని కోరారు. నర్సరీని పంచాయతీ కార్యదర్శులు, ఏఫ్ఏలు, మేట్లు, వనసేవకులు నిత్యం సందర్శించి పనులు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బర్మవత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదనాచారి, ఏపీవో మోహన్‌రావు, ఈసీ కిరణ్ కుమార్, టీఏలు చేరాలు, కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు అజీజ్‌పాషా పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 26: కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అబ్బాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీ రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలు తెస్తున్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, నాయకులు యాదగిరి, అహల్య, రాజు, రమేశ్, సోమన్న, జిల్లా కమిటీ సభ్యుడు గోపి పాల్గొన్నారు.

వేప కర్రను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

తరిగొప్పుల, ఫిబ్రవరి 26 : నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా వేప కర్రను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని ఏన్యానాయక్ తండా చౌరస్తాలో పెట్రోలింగ్ చేశారు. అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో వేప కర్రను తరలిస్తుండడంతో డ్రైవర్ నక్క శ్రీకాంత్‌ను పోలీసులు వివరణ కోరారు. నర్మెట మండలం ఆగపేట నుంచి మండలంలోని బొత్తలపర్రెకు కర్రను తరలిస్తున్నట్లు తెలిపాడు. అధికారుల అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో తరలిస్తుండడంతో ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పాలకుర్తి, ఫిబ్రవరి 26: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరవత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల హెచ్ఎం శోభ, నాయకులు ప్రకాశ్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న నాయకులు

'మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్టీలకే కేటాయించాలి'

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి రూరల్, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్టీలకే కేటాయించాలని, రిజర్వేషన్ మార్పు ప్రక్రియను విరమించుకోవాలని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు ధరావత్ యాకూబ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. యాకూబ్‌నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో నాటి సీఎం కేసీఆర్ ఎస్టీల సంక్షేమానికి మా తండాలో మా రాజ్యం నినాదం అమలు చేశారని, తండాలను జీపీలుగా మార్చారని కొనియాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో పాలకుర్తి మార్కెట్ చైర్మన్ పదవిని ఎస్టీ మహిళలకు కేటాయించారన్నారు. దీనిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే జనరల్‌గా మార్చేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి సహకారంతో మండల కేంద్రంలో సేవాలాల్ భవన నిర్మాణ కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారని వారు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు లకావత్ వెంకట్‌నాయక్, నాగరాజు, సురేశ్, బానోత్ శంకర్‌నాయక్, బానోత్ మహేందర్, లకావత్ మోతీలాల్, లావుడ్యా నేపాల్, బాలునాయక్, హూస్సేన్, రవి, సురేశ్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే కడియం పరామర్శ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 26 : మండలంలోని వడ్లెగూడేనికి చెందిన శోధనబోయిన కొమురెల్లి (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, వైస్ చైర్మన్ మొగిలిపాక నర్సింహ, ఎంపీటీసీ ఇల్లందుల స్రవంతి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్, మోహన్ రావు, మండల నాయకులు యాకయ్య, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని పల్లగుట్టకు చెందిన కటికనేని రామారావు, కృష్ణాజీగూడెంలో బుస్స వెంకటయ్య, గుండెల్లి వెంకటయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్థివదేహాలకు పూలమాలలు వేసి నిశాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్‌నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మార్కెట్ డైరెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ స్వామినాయక్, మాజీ సర్పంచ్ సుధాకర్, బీఆర్ఎస్ పల్లగుట్ట గ్రామ అధ్యక్షుడు రత్నకర్‌రెడ్డి, నాయకులు జీడీ ఆనందం, పుట్ట రవీందర్‌రెడ్డి, గట్టయ్య, అనిల్‌పాల్, కిట్టు పాల్గొన్నారు.

సకాలంలో ఆర్టీసీ బస్సులు నడుపాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 : ఈ నెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను సకాలంలో నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కిసాన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ జంగిటి నరేశ్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాసేందుకు జనగామకు వెళ్లాల్సి ఉన్నందున ఉదయం 9 గంటలోపే బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 : మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీటి సరఫరాను సక్రమంగా అందించాలని, ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ (ఇంట్రా) డీఈ అనిల్‌కుమార్ సూచించారు. దీనిపై ఎంపీడీవో రఘురామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు సోమవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి రోజూ వాటర్‌మెన్లతో తాగునీటి సరఫరాపై పర్యవేక్షించాలన్నారు. పైపులైను లీకేజీలుంటే వెంటనే సమాచారం అందించి మరమ్మతు చేయించాలన్నారు. వేసవి సీజన్ సమీపించిన తరుణంలో అధికారులు అప్రమత్తం కావాలన్నారు. మిషన్‌భగీరథ (గ్రిడ్) డీఈ వేణుగోపాల్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు

నిలిపివేయాలని తహసీల్దార్‌కు పలువురి వినతి

తహసీల్దార్ విశాలాక్షికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 : మండలంలోని బసిరెడ్డిపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా క్రషర్‌లో బ్లాస్టింగ్స్ చేయడంతో ఎస్సీ కాలనీలో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ విశాలాక్షికి అందించారు. ఈ సందర్భంగా దళితులు సీహెచ్ మల్లయ్య, కిష్టయ్య, బాలసిద్ధయ్య, భాస్కర్, కిష్టయ్య మాట్లాడుతూ భారీ డ్రిల్లింగ్‌తో బ్లాస్టింగ్ చేయడంతో ఇండ్లు ధ్వంసమవుతున్నాయని, పలువురికి గుండెపోటు వస్తున్నదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలను ఉపయోగించి క్వారీని నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గాల్లో దుమ్ము ధూళి వచ్చి అనేక మంది ఆనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి క్రషర్ నిర్వహణను నిలిపివేసి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్‌తో పాటు జిల్లా అసిస్టెంట్ మైనింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రాలు అందించామని వారు వెల్లడించారు. శ్రీకాంత్, అంజమ్మ, లక్ష్మయ్య, లక్ష్మణ్, సిద్దిమల్లయ్య పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

జనగామ రూరల్, ఫిబ్రవరి 26: జిల్లా కేంద్రం